ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు
- బెయిల్ ముగిశాక చంద్రబాబు జైలుకెళ్లాల్సిందే


ఇస్వీలో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యమని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఇస్వీ గ్రామంలో సోమవారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడప తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలు చేకూరిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. గ్రామంలో మంచినీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు, ప్రజల ఆరోగ్యం, స్థానిక సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఇంటికి రూ.3 లక్షల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయం నిధులు రూ.20 లక్షలతో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల పనులకు ఎస్టిమేషన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో జలజీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి అనారోగ్య కారణాల వల్లనే కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, గడువు ముగిసిన తర్వాత మళ్లీ జైలుకు వెళ్లాల్సిందేనని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. చేసిన కర్మలను అనుభవించక తప్పదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని స్పష్టం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి, కల్పవల్లి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్‌బాషా, హౌసింగ్‌బోర్డు అధికారి తిక్కన్న, సర్పంచ్ శ్యామలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠానికి కర్ణాటక పాదయాత్రికులు


కాలినడకన పాదయాత్రగా వస్తున్న కర్ణాటక భక్తులు

మంత్రాలయం: ప్రముఖ మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి కర్ణాటక నుంచి భక్తులు కాలినడకన తరలివచ్చారు. కర్ణాటకలోని దారవాడ, మాన్వి, గంగావతి, ప్రాంతాల నుంచి దాదాపు 200 మందికి పైగా పాదయాత్ర భక్తులు సోమవారం మంత్రాలయంకు చేరుకున్నారు. భజనలు, కీర్తనలతో మఠానికి చేరుకుని ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల బృందావన దర్శనం చేసుకుని భజనలు చేపట్టారు.

క్లుప్తంగా

ఈరన్న స్వామికి అభిషేక పూజలు


స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు అజయ్‌బాబు

ఆదోనిరూరల్: కేంద్ర ప్రభుత్వం న్యూస్ క్లిక్ మీడియా సంస్థ, కేంద్ర రైతు కార్మిక సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూసీ రైతు సంఘాల నాయకులు వాపోయారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ముందు ఎఫ్ఐఆర్ కాపీ నకళ్లను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు అజయ్‌బాబు, మహానందరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన మీడియాపై, రైతు కార్మిక ఉద్యమాలు చేస్తున్న నాయకులపై కేసులు పెట్టడం దారణం అని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఐటీయూ నాయకులు కృష్ణమూర్తి, నాగేంద్ర, హనుమంతు, వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోసిగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోసిగి: మండల కేంద్రం కోసిగి–4 సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. కోసిగి –4 సచివాలయం పరిధిలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, ప్రజా సమస్యలను నేరుగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి


శ్రీమఠం ప్రాంగణంలో కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి చెలువ రాయస్వామి

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి చెలువ రాయస్వామి మంత్రాలయం విచ్చేశారు. సోమవారం రాత్రి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ వేణుగోపాల్ రాజు నేతృత్వంలో దర్శన ఏర్పాట్లు చేశారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ఆలూరు రూరల్: దీపావళి పర్వదినం సందర్భంగా బాణాసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఆలూరు అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ అధికారి ఖాద్రి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. షాపుల మధ్య 3 మీటర్ల దూరం ఉండాలన్నారు. దుకాణాల ముందు రెండు డ్రమ్ముల నీటిని ఉంచుకోవాలి. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదు. పాడైపోయిన విద్యుత్ వైర్లు వాడరాదన్నారు. అగ్నిప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలి, అలాగే బాణా సంచా విక్రయ షాపులను స్థానిక సంత మార్కెట్‌లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు రోజుల మాత్రమే విక్రయాలకు అనుమతిస్తామన్నారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు


దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోనిటౌన్: స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్, మనోజ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మార్కెట్ యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, పట్టణాధ్యక్షుడు దేవా పాల్గొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 350 గడపలను తిరిగారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యేకు వివరించి పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. కౌన్సిలర్లు రహమాన్, లక్ష్మన్న, గోవిందు, నాయకులు, కార్యకర్తలు వీరప్ప, రామక్రిష్ణ, మహ్మద్, ఇషాక్, లక్ష్మినారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించిన తేదీ పురస్కరించుకుని 28వ వార్డు మట్కారీ గేరిలో చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేకును మనోజ్‌కుమార్ రెడ్డి కట్ చేసి పార్టీశ్రేణులు, ప్రజలందరికీ పంచి పెట్టారు. ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి నేటికి ఆరేళ్లు పూర్తి చేసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు.

'విశాఖ ఉక్కు'ను కాపాడుకుందాం


కోసిగిలో పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కోసిగి: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం విద్యార్థులు, యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మంత్రాలయం తాలుకా ప్రధాన కార్యదర్శి రాజు, తాలుకా అధ్యక్షుడు ఎస్.ఈరేష్, మండల కార్యదర్శి అంజి కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వమే నిధులు వెచ్చించి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటయితే చాల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే ఎంతో ప్రాముఖ్యత ఉన్న స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడం తగదన్నారు. విద్యార్థులు, యువత ఉద్యమంలో పాల్గొని ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆయా విద్యార్థి, యువజన సంఘః నాయకులు బడేసాబ్, అశోక్, జిలానీ, నరసింహులు, కిరణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చూడి గ్రామ సచివాలయం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: మండల పరిధిలోని చూడి గ్రామ సచివాలయంను సోమవారం ఎంపీడీఓ సుబ్బరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. కార్యదర్శి మంజునాథ్‌తో మాట్లాడి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. గ్రామస్తులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

చూడి గ్రామంలో మూలే ఉసేనమ్మ ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ బీమా నామినీగా ఉన్న భర్త హనుమంతప్పకు తక్షణ సాయం కింద మంజూరైన రూ.పది వేలను ఎంపీడీఓ, సర్పంచ్‌లు అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, నాయకులు రమేష్, ఉప్పలప్ప మాట్లాడుతూ వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం లాంటిదన్నారు. నాయకులు ఉచ్చప్ప, లింగన్న, బసవరాజ్‌గౌడ్, వీరభద్రగౌడ్ ఉన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థిని తస్లీమాను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

ఆదోనిసెంట్రల్: ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని వి.తస్లీమా స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 యోగా క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యిందని ప్రిన్సిపాల్ సంజన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎంపికైన విద్యార్థినిని అభినందించారు. విద్యార్థిని పశ్చిమగోదావరి జిల్లాలో వీరవసరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 యోగా క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. అలాగే నేషనల్ యోగా క్రీడలకు ఎంపిక అయ్యిందని చెప్పారు. చదువుతో పాటు యోగాలో రాణిస్తున్న విద్యార్థిని తస్లీమాను అభినందించారు. వ్యాయామ అధ్యాపకులు చిట్టిప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రేరక వక్త హర్షకిరణ్

ఆదోనిసెంట్రల్: విద్యార్థులు చదువులో రాణిస్తే జీవితంలో రాణించినట్లేనని ప్రముఖ ప్రేరక వక్త టి.హర్షకిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని కిడ్డీస్ రూట్స్ గ్లోబల్ స్కూల్‌లో ప్రసంగ కార్యక్రమానికి ప్రముఖ ప్రేరక వక్త టి.హర్షకిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చేరుకోవాల్సిన లక్ష్యాలకు సంబంధించిన అంశాలను క్లుప్తంగా వివరించారు. పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని చెప్పారు. పాఠశాల డైరెక్టర్ కేశవనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి


ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోనిరూరల్: ఈనెల 11న మాదిగ, ఉప కులాల విశ్వరూప మహాసభ కోసం ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆదోనిలోని ఇందిరాగాంధీ నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ కులస్తులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. నాయకులు మణికంఠ, మన్మోహన్, అజయ్, చిన్నకుమార్, రామంజి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించండి


ఆదోనిలో స్పందన కార్యక్రమంలో సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్


ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని

- ఆదోని మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన బసవరాజుకు సంబంధించి సర్వే నంబర్ 122లో 11.95 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించినదని, ఆ భూమిపై పలు అమ్మకాలు జరుగగా, ప్రస్తుతం ఆ సర్వే నంబర్ తప్పుగా నమోదయ్యిందని, విచారణ చేసి సరైన సర్వే నంబర్‌ను నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- హొళగుంద మండలం మడ్డిలింగదహళ్లికి చెందిన కురువ హనుమంతప్ప ఇంటికి వెళ్లే దారిలో ప్రభుత్వ రోడ్డు ఆరు అడుగుల భూమి ఆక్రమించుకుని నిర్మాణం చేపడుతున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.
- హొళగుంద మండలం కుంటనహాల్ గ్రామానికి చెందిన గంగమ్మకు సంబంధించి సర్వే నంబర్ 329లో 1.35 ఎకరాలు, సర్వే నంబర్ 333లో 0.5 సెంట్ల భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామానికి చెందిన కె.తిక్కన్నకు చెందిన సర్వే నంబర్ 60, 60బీ, 24ఏ, 59ఏ, 59బీలకు సంబంధించి సదరు భూమిని సర్వే చేయాలని అర్జీ సమర్పించారు.

స్పందన కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, సీనియర్ సహాయకులు రామయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీయల్‌డీఓ నాగేశ్వర రావు,ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్లు వలీబాషా, కౌసర్‌బాను, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరిస్తాం

ఆదోనిటౌన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు దరఖాస్తులు కమిషనర్‌కు అందజేశారు. సీసీ రోడ్లు,మురుగు కాలువలు, శ్మశాన వాటికలో సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని అంజుమాన్ ఫిర్యాదు చేశారు. రేషన్ కార్డులను పూర్తిస్థాయిలో అర్హులకు అందించాలని వినతి పత్రం అందజేశారు. శివారు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని అర్జున్ అనే వ్యక్తి కమిషనర్ దృష్టికి తెచ్చారు. డీఈ నాగభూషణంరెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన పోటీలకు ఎంపిక

ఆదోనిరూరల్: కర్నూలులో జరిగిన 31వ నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ)–2023 కాంపిటీషన్‌లో జిల్లాస్థాయిలో మండలంలోని విరుపాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న వరుణ్‌సందేశ్, నరేంద్ర ప్రతిభ చాటుకుని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈఓ ప్రకటించారని గైడ్ టీచర్ ఆదిమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. గ్రామీణ సంప్రదాయ క్రీడల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు పొందే జీవన నైపుణ్యాలు అనే అంశంపై విద్యార్థులు నమూనా ప్రాజెక్టు ప్రదర్శించినట్లు చెప్పారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్ల ప్రకటన

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, 67వ అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ అండర్–17 బాలుర, బాలికల పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన బాలుర జట్టు అండమాన్ నికోబార్‌లోను, బాలికల జట్టు బీహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఫైనల్ పోటీల అనంతరం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య, పోటీల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రభాకర్ రాష్ట్ర జట్లను ప్రకటించారు. బాలుర రాష్ట్ర జట్టులో విజయనగరంకు చెందిన జయసూర్య, జాన్సిరాజు, చైతన్య, కర్నూలు జిల్లా నుంచి బి.ఈశ్వర్, సి.గణేష్, దాదాఖలందర్, అభిరామ్ రాజ్, చిత్తూరుకు చెందిన నరేష్, నితిన్, విష్ణువర్ధన్, వెస్ట్‌గోదావరికి చెందిన సంతోష్, సక్సాంత్, విశాఖపట్టణంకు చెందిన గురుచరణ్, శ్రీకాకుళంకు చెందిన సంపత్‌కుమార్, ఈస్ట్‌గోదావరికి చెందిన సాయి సూర్యహర్షరెడ్డి, వైఎస్ఆర్ జిల్లా అడ్రినాల్డ్ జార్జి వాకిన్స్, గుంటూరుకు చెందిన అఫ్రోజ్, కృష్ణా జిల్లాకు చెందిన హర్షవర్ధన్ రాజు ఎంపికైనట్లు ప్రకటించారు. బాలికల రాష్ట్ర జట్టుకు అనంతపురం జిల్లాకు చెందిన పావని, అక్షిత, అల్మాస్, వైఎస్సార్ జిల్లాకు చెందిన అరుణ, దేవి, శ్రావణి, కర్నూలు జిల్లాకు చెందిన సుమాంజలి, అస్మసహన్, ఇందు, విశాఖపట్టణంకు చెందిన కావ్య, రోహిణి, గుంటూరు జిల్లాకు చెందిన శీలక్ష్మి, వెస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన సుస్మిత, కృష్ణా జిల్లాకు చెందిన అపర్ణ, విజయనగరం నుంచి లలిత, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన భవాని సునయన, నెల్లూరు జిల్లాకు చెందిన కావ్య, చిత్తూరు జిల్లాకు చెందిన హర్షిత, భవాని ఎంపికైనట్లు వెల్లడించారు.

కరువు జాబితా సిద్ధం


కౌతాళంలో దెబ్బతిన్న వరి పంట

కౌతాళం: మండలానికి సంబంధించి కరువు జాబితాను సిద్ధం చేసినట్లు ఏఓ శేషాద్రి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కౌతాళంను ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడంతో మండలంలో సాగైన వివిధ పంటలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఆయన తెలిపారు. మండలంలో 28,491 మంది రైతులు వివిధ రకాల పంటలను 66,914 ఎకరాల్లో సాగు చేసినట్లు వివరించారు. వరి పంటను 2780 మంది రైతులు 5767 ఎకరాల్లో, కంది పంటను 50 మంది రైతులు 75 ఎకరాల్లో, వేరుశనగను 167 మంది రైతులు 295 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. అత్యధికంగా పత్తి పంటను 16,827 మంది రైతులు 43,265 ఎకరాల్లో సాగు చేశారని, ఆముదం పంటను 241 మంది రైతులు 405 ఎకరాల్లో సాగుచేశారని, సద్దలను 37 మంది రైతులు 67 ఎకరాల్లో సాగుచేశారని తెలిపారు. అలాగే కొర్ర పంటను 20 మంది రైతులు 35 ఎకరాల్లో సాగు చేయగా, చెరుకు పంటను 31 మంది రైతులు 105 ఎకరాల్లో సాగుచేసినట్లు చెప్పారు. మిరప పంటను 8078 మంది రైతులు 16541 ఎకరాల్లో సాగు చేశారని అలాగే ఉల్లి పంటను 260 మంది రైతులు 358 ఎకరాల్లో సాగుచేసినట్లు వివరించారు. పై వివరాలతో జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత కర్నూలు


విజేత కర్నూలు బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న డీఈఓ రంగారెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ డాక్టర్ రంగారెడ్డి సూచించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ అండర్–17 బాలుర, బాలికల పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు తలపడ్డాయి. బాలుర విభాగం ఫైనల్ పోటీల్లో విజేతగా కర్నూలు జిల్లా జట్టు నిలిచింది. ద్వితీయ స్థానం విజయనగరం జట్టు, తృతీయ స్థానం చిత్తూరు జట్టు కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో విజేతగా వైఎస్సార్ జిల్లా జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో అనంతపురం, తృతీయ స్థానం కర్నూలు జిల్లా జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు డీఈఓ చేతులమీదుగా ట్రోఫీ, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. బెస్ట్ ప్లేయర్‌గా నిలిచిన కర్నూలు జట్టు క్రీడాకారుడు గణేష్‌కు సైకిల్‌ను బహూకరించారు. బెస్ట్ టీంగా వెస్ట్‌గోదావరి నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు దేహదారుఢ్యం లభిస్తుందన్నారు. క్రీడాకారులకు తమలో ఉన్న ప్రతిభను చాటుకొనే అవకాశం లభిస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో జరిగే పోటీల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. పోటీల రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య, శివకుమార్, ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సురక్షతో గ్రామంలోనే నాణ్యమైన వైద్యం


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్టును అందజేస్తున్న వైద్యులు, అధికారులు


వైద్య సేవలందిస్తున్న డాక్టర్


బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోనిరూరల్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటుందని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మహాదేవ, ఎంపీటీసీ కె.నాగభూషణంరెడ్డి, ఆత్మ చైర్మన్ కృష్ణారెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బైచిగేరి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాధులిక, అంకాబు, మయూర్‌కుమార్, శేఖర్ పాల్గొని 300 మందికి పైగా రోగులను పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ పరిశీలించారు. ప్రజలు పౌష్టికాహారమైన ఆకుకూరలు, పప్పుదినుసులు తదితర వాటిని ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మినారాయణ, ఎంఎల్‌ఓలు, ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.